సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 12 । జూలై । 2023



12 కుటుంబాల వెలి
తమను వెలివేశారంటూ పెనుగొండ మండలం మిద్దేవారిపాలెం గ్రామస్తులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు ఇరువర్గాలకు సర్దిచెప్పారు. 8లో ▸



గోదావరిలో పెరిగిన ప్రవాహం
గోదావరికి వరద స్వల్పంగా పెరిగింది. నిన్నామొన్నటి వరకు ఇసుక దిబ్బలు దర్శనమివ్వగా మంగళవారం ఆ ఇసుక దిబ్బలు నీటితో నిండాయి. 8లో ▸



వర్షాకాలం.. జర భద్రం
వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుతం అక్కడక్కడ జ్వరాల కేసులు నమోదువుతున్నాయి. 8లో ▸

న్యూస్‌రీల్

జమీందారీ భూముల సమస్య పరిష్కారానికి కృషి



మొగల్తూరు రెవెన్యూ కార్యాలయంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

మొగల్తూరు: ఎన్నో ఏళ్ళుగా అపరిష్కృతంగా ఉన్న కాళీపట్నం జమీందారి భూముల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రైతులతో సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులు తమ అభిప్రాయాలు తెలియచేస్తే వాటిని పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జమీందారి భూములు పేదలకు పంచాలని పోరాటం చేస్తున్న మేడిది బాబ్జీతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సాగు చేసుకుంటున్న రైతులతో మరోసారి విడిగా సమావేశమై సమస్యను శాంతియుతంగా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని, రైతుల మనోభావాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, తహసీల్దార్ జి.అనితాకుమారి, జెడ్పీటీసీ తిరుమాని బాపూజి, రైతులు మేడిది బాబ్జి, మోటుపలి రాం భాస్కరరావు, సరిపల్లి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు 2వ విడత కౌన్సెలింగ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లాలోని 5 ప్రభుత్వ, 14 ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం రెండో విడత కౌన్సిలింగ్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు ఐటీఐ ప్రధానాధికారి పీ.రజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ వెబ్‌సైట్‌లో స్టూడెంట్ ఏరియాలోకి వెళ్ళి విద్యార్థి ఆన్‌లైన్ దరఖాస్తును ఈ నెల 13 సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలని సూచించారు. అనంతరం దరఖాస్తు కాపీని ప్రింట్ తీసుకుని విద్యార్థి తన ఒరిజినల్ సర్టిఫికెట్లతో తాము ఎంచుకున్న సంబంధిత ఐటీఐలలో ఆగస్టు 1 సాయంత్రం 5 గంటల లోపు వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. ఏలూరు జిల్లాలో ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో 700 సీట్లు, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 1712 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై ఆపై చదువుకుని ఉపాధి కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు కూడా ఈ ప్రవేశాలకు అర్హులని, 8వ తరగతి ఉత్తీర్ణులై 10వ తరగతి అనుత్తీర్ణులైన విద్యార్థులు వెల్డర్ ట్రేడ్‌కి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఇతర వివరాలకు 08812–230269 నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

బెస్ట్ ఫ్యామిలీ ప్లానింగ్ సర్జన్‌గా దుర్గామహేశ్వరరావు



భీమవరంలో డాక్టర్ దుర్గామహేశ్వరరావుకు అవార్డు అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని పీపీ యూనిట్ విభాగ వైద్యాధికారి డాక్టర్ బి.దుర్గామహేశ్వరరావు బెస్ట్ ఫ్యామిలీ ప్లానింగ్ సర్జన్ అవార్డును కలెక్టర్ పి.ప్రశాంతి చేతులమీదుగా మంగళవారం అందుకున్నారు. జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమవరంలో అందచేసిన అవార్డుల్లో దుర్గామహేశ్వరరావును కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

మేజిస్ట్రేట్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పోస్టును తాత్కాలిక పద్ధతిపై భర్తీ చేసేందుకు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఆగస్టు 20 సాయంత్రం 5 గంటల లోపు జిల్లా జడ్జి, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ కోర్టు, ఏలూరుకు చేరేలా పంపాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.30 వేలు గౌరవ వేతనంగా చెల్లిస్తారన్నారు. ఆంధ్రప్రదేశ్ హయ్యర్ జ్యుడీషియల్, స్టేట్ జ్యుడీషియల్‌లో రిటైరయిన వారు లేదా రాజీనామా చేసిన వారు, జ్యుడీషియల్ మినిస్టీరియల్ సర్వీసెస్‌లో న్యాయశాస్త్ర డిగ్రీ కలిగి జిల్లా మున్సిఫ్ కోర్టు స్థాయిలో హెడ్ క్లర్క్ లేదా అంతకంటే ఎక్కువ అర్హత కలిగిన వారు, రాష్ట్ర హైకోర్టు సర్వీసెస్‌లో సెక్షన్ ఆఫీసర్ లేదా ఆపై స్థాయి ఉన్నవారు, 45 సంవత్సరాలు దాటి బార్ అసోసియేషన్‌లో కనీసం 5 సంవత్సరాలు ప్రాక్టీస్ కలిగిన వారు అర్హులుగా పేర్కొన్నారు.



ఉండి : పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలకు నిరసనగా ఉండి సెంటర్‌లో మావవహారంగా ఏర్పడి వలంటీర్ల నిరసన



నరసాపురం రూరల్ : పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో పవన్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వలంటీర్లు

ఉవ్వెత్తున ఎగసిన నిరసన జ్వాలలు

- పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై వలంటీర్ల ఆగ్రహం
- రెండో రోజూ కొనసాగిన నిరసనలు
- పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మలను దహనం చేసిన వలంటీర్లు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: రాష్ట్రంలోని వలంటీర్లు, వలంటీర్ల వ్యవస్థపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కల్యాణ్ క్షమాపణలు చెప్పాలంటూ ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలో రెండోరోజూ నిరసనలు కొనసాగాయి. పవన్ దిష్టిబొమ్మను దహనం చేసి తమ ఆగ్రహాన్ని వెలిబుచ్చారు. ర్యాలీలు, రాస్తారోకోలు నిర్వహించారు. ఆదివారం ఏలూరులో నిర్వహించిన సభలో వలంటీర్ల వ్యవస్థపై పవన్ ఇష్టానుసారంగా మాట్లాడటంతో పాటు వలంటీర్లను అసాంఘిక శక్తులతో పోల్చిన సంగతి తెలిసిందే.. దీంతో ఆయన తీరుపై వలంటీర్లు తీవ్ర స్థాయిలో మండిపడుతూ నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.

ఏలూరు జిల్లాలో..

- ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటరులో పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు నిరసనగా వలంటీర్లు ఆందోళన చేశారు. పవన్ దిష్టిబొమ్మను దహనం చేసి ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో 15వ డివిజన్ పరిధిలోని వార్డు సచివాలయాల వలంటీర్లు పాల్గొన్నారు. స్థానిక 35వ డివిజన్ కొత్తపేట 12 పంపుల సెంటరులో ఆ డివిజన్ పరిధిలోని వలంటీర్లు రాస్తారోకో నిర్వహించారు.
- పోలవరం నియోజకవర్గంలో టీ.నరసాపురం అంబేద్కర్ సెంటర్‌లో వలంటీర్లు ఆందోళన నిర్వహించి పవన్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దతు తెలిపారు. కొయ్యలగూడెం మండలంలోని యర్రంపేట అడ్డరోడ్డు, బయ్యనగూడెం, వేదాంతపురం, మంగపతిదేవిపేట, బోడిగూడెం గ్రామాల్లో వలంటీర్లు నిరసన తెలిపారు. పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం చేశారు.
- గోపాలపురం నియోజకవర్గం ద్వారకాతిరుమల మండలంలో వలంటీర్లు నిరసన కార్యక్రమం నిర్వహించి పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు.
- చింతలపూడి నియోజకవర్గం లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో వలంటీర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. ధర్నా నిర్వహించి పవన్ దిష్టిబొమ్మ దహనం చేశారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. పవన్ చిత్రపటాన్ని దహనం చేశారు.
- ఉంగుటూరులో పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను నిరసిస్తూ భారీ ఎత్తున నిరసన తెలిపారు. జాతీయ రహదారిపై మానవహారంగా ఏర్పడి ఆందోళన చేశారు. పవన్‌కల్యాణ్ చిత్రాల్ని దహనంచేశారు. పవన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భీమడోలు జంక్షన్‌లోను వలంటీర్లు నిరసన కార్యక్రమం కొనసాగించింది. కైకలూరు నియోజకవర్గం మండవల్లిలో పవన్ కల్యాణ్ పోస్టర్లను దహనం చేశారు.



తణుకు అర్బన్ : రాష్ట్రపతి రోడ్డులో వలంటీర్ల నిరసన ర్యాలీ



పోడూరు : జిన్నూరు పంచాయతీ సెంటర్ వద్ద పవన్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వలంటీర్లు



భీమడోలు : పవన్ కల్యాణ్ ఫ్లెక్సీ దహనం

పశ్చిమగోదావరి జిల్లాలో..

- నర్సాపురంలో పవన్ వ్యాఖ్యలకు నిరసనగా అంబేద్కర్ సెంటర్‌లో వలంటీర్లు నిరసన ర్యాలీ చేసి మానవహారం నిర్వహించారు. అనంతరం పవన్ దిష్టి బొమ్మను దహనం చేశారు.
- ఉండి నియోజకవర్గం ఉండి ప్రధాన సెంటర్‌లో వలంటీర్లు మానవహారం నిర్వహించారు. అనంతరం ఉండి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వలంటీర్ల నిరసన కార్యక్రమాలతో ట్రాఫిక్ స్తంభించింది. కాళ్ల మండలం పెద అమీరం, కోపల్లే, ఎల్ఎన్ పురం, కాళ్ల, జక్కరం గ్రామలకు చెందిన వలంటీర్లు పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలకు నిరసనగా రాష్ట్రీయ రహదారిపై నిరసన తెలిపి పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వినతి పత్రం చేశారు. ఆకివీడు మండలంలోని దుంపగడప, చెరుకుమిల్లి గ్రామాల్లో వలంటీర్లు నిరసనలు తెలిపారు. పాలకోడేరు మండలం జాతీయ రహదారిపై పవన్ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు.
- తణుకులో వలంటీర్లు ధర్నా చేపట్టారు. ర్యాలీ నిర్వహించి పవన్ కల్యాణ్ దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరం తణుకు పోలీస్ స్టేషన్‌లో పవన్ కల్యాణ్ పై ఫిర్యాదు చేశారు.



ఏలూరు టౌన్: ఫైర్ స్టేషన్ సెంటర్‌లో పవన్ దిష్టి బొమ్మ దహనం చేస్తున్న వలంటీర్లు



టి.నరసాపురం: ప్రధాన సెంటర్‌లో పవన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం



పాలకోడేరు : విస్సాకోడేరు-గొరగనమూడి హైవేపై పవన్ దిష్టిబొమ్మ దహనం

అభివృద్ధే మా కులం



మార్టేరులో రేషన్‌కార్డులు అందజేస్తున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పెనుమంట్ర: కుల, మత, రాజకీయాలకు అతీతంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాలతో ముందుకు వెళ్తుందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం మార్టేరు రెడ్డి కల్యాణ మండపంలో సర్పంచ్ మట్టా కుమారి రాము అధ్యక్షతన మార్టేరు 1, 2 సచివాలయాల పరిధిలోని జగనన్న సురక్ష గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ అభివృద్దే మా కులం, సంక్షేమమే మా మతం అనే సిద్ధాంతంతో రాజకీయాలతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. టీడీపీ జన్మభూమి సభలలో వందలకొద్దీ దరఖాస్తులు తీసుకుని అందులో రెండు మూడు మాత్రమే పరిష్కరించేవారని, అవి కూడా టీడీపీ వారికే పెన్షన్‌లు మంజూరు చేసేవారని పేర్కొన్నారు. నాలుగేళ్లుగా వలంటీర్‌లు గడపగడపకు వెళ్లి వేల కోట్ల రూపాయలు లబ్ధిదారులకు అందజేశారని ఆయన పేర్కొన్నారు. సురక్ష పథకంలో వెంటే ధ్రువపత్రాలు జారీ చేస్తామన్నారు. నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ వలంటీర్ల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. గ్రామసభలో 1374 మందికి ధ్రువపత్రాలు అందజేసారు. కార్యక్రమంలో పెనుగొండ ఏఎంసీ చైర్‌పర్సన్ వెలగల వెంకటరమణ, జడ్పీటీసీ కర్రి గౌరీ సుభాషిణి, ఎంపీపీ కర్రి నారాయణరెడ్డి, ఎంపీటీసీలు గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, కర్రి అనురాధ, కొవ్వూరి వేణుమాధవరెడ్డి, చిర్ల సత్యానారాయణరెడ్డి, అల్లం భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలుడి హత్యతో ఉలిక్కిపడ్డ ఏజెన్సీ

బుట్టాయగూడెం: కొండరెడ్డి గిరిజన విద్యార్థి అఖిల్ వర్ధన్ రెడ్డి హత్య సంఘటనతో గిరిజన ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. గత ఆదివారం బుట్టాయగూడెం మండలం దొరమామిడి సమీపంలోని పునరావాస గ్రామమైన కొత్తసరుగుడులో 11 నెలల బాలుడు అదృశ్యమైన సంఘటన మిస్టరీగానే ఉండగా విద్యార్థి హత్య సంచలనం రేపింది. రెండు కేసులను చాలెంజింగ్‌గా తీసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. అనుమానితులను విచారించడంతో పాటు ఆధారాలను రాబట్టే పనిలో నిమగ్నమయ్యారు. కొండరెడ్డి విద్యార్థి మృతదేహాన్ని చూసిన ప్రతిఒక్కరూ చలించిపోతున్నారు. పులిరామన్నగూడెం ఆశ్రమ పాఠశాలలో గత మూడేళ్ళుగా ఏదో ఒక సంఘటన చోటుచేసుకుంటూనే ఉందని గ్రామస్తులు చెప్తున్నారు. వసతి గృహంలో రెగ్యులర్ వార్డెన్ నియమించకపోవడంతో ఉపాధ్యాయులనే డిప్యూటీ వార్డెన్‌లుగా నియమించారు. కనీసం వాచ్‌మెన్ కూడా అందుబాటులో లేని పరిస్థితి ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుల మధ్య విభేదాలు ఉన్నట్లు చెబుతున్నారు. ప్రధానోపాధ్యాయుడు కుక్కునూరు మండలం మాధవరం, దొరమామిడి, పీఆర్‌గూడెం ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న కాలంలో అన్ని గొడవలేనని అంటున్నారు. ఉపాధ్యాయుల మధ్య విభేదాలతో ఈ సంఘటన చోటు చేసుకుందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఒర్రింక వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. తల్లి రామలక్ష్మి ఆశ వర్కర్‌గా పనిచేస్తుంది.

మూడు బృందాలతో దర్యాప్తు



పులిరామన్నగూడెంలో డాగ్‌స్క్వాడ్ తనిఖీలు

డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఒక బృందం, జీలుగుమిల్లి సీఐ బి.వెంకటేశ్వరరావు, పోలవరం సీఐ విజయ్‌కుమార్, కుక్కునూరు సీఐ కెవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో బృందాలు హత్యకేసును ఛేదించే పనిలో నిమగ్నమయ్యాయి. హత్య, ఎస్సీ, ఎస్టీ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ జె.మురళి మంగళవారం రాత్రి పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి విద్యార్థి మృతిపై ఆరా తీశారు.

విద్యార్థి మృతి పట్ల దిగ్భ్రాంతి

విద్యార్థి మృతిపట్ల ఎమ్మెల్యే తెల్లం బాలరాజు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ పీఓలతో మాట్లాడి ఈ సంఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

నేడు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాక

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర పులిరామన్నగూడెంలో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తెలిపారు.

జగనన్న సురక్షతో పేదలకు మేలు



సీతారామపురంలో ధ్రువపత్రం అందజేస్తున్న చీఫ్ విప్ ప్రసాదరాజు

నరసాపురం రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు ఒక్క పైసా ఖర్చు లేకుండా అందిస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. నరసాపురం 29వ వార్డులోని 14వ సచివాలయం, 8వ వార్డులోని కోటవద్దపాలెం వద్ద ఉన్న 4వ సచివాలయం, మండలంలోని సీతారామపురం సౌత్ గ్రామ సచివాలయాల వద్ద మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ప్రసాదరాజు పాల్గొని మాట్లాడారు. ప్రతి పేద కుటుంబానికి మేలు చేయడానికే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్షకు శ్రీకారం చుట్టిందన్నారు. సంక్షేమ అభివృద్ధి పథకాలను అర్హులందరికీ అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వలంటీర్లు వారధిలా, సేవా దృక్పథంతో పనిచేస్తోన్న వలంటీర్ వ్యవస్థపై నిందలు వేస్తూ మాట్లాడిన జనసేన అధినేతకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా అర్హులకు వివిధ ధ్రువపత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. నిర్ణీత సమయంలో సర్వేను పూర్తిచేసిన నోడల్ ఆఫీసర్ సత్యనారాయణ, అడ్మిన్ సెక్రటరీ షహీనా, వలంటీర్లు సిర్రా జ్యోతి, మోటూరి వేణుగోపాల్ తదితరులను 14వ సచివాలయం వద్ద ప్రసాదరాజు చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్లో ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, వైస్ చైర్మన్లు కొత్తపల్లి భుజంగ రాయుడు, కామన నాగిని, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, వ్యవసాయశాఖ ఏడీ ఈదా అనిల్ కుమారి, ఎంపీడీఓ శివప్రసాద్‌యాదవ్, కౌన్సిలర్లు సిర్రా కాంతమ్మ, కస్తూరి ఇందిరాదేవి, సర్పంచ్ దొండపాటి వెంకట్, ఏడిదకోట సత్యనారాయణ (వైకేఎస్), బుల్లమస్తాన్ తదితరులు పాలొన్నారు.

కుటుంబ నియంత్రణలో భాగస్వాములవ్వాలి



ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): చిన్న కుటుంబం చింతలు లేని కుటుంబమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పిలుపునిస్తున్నాయని, ఆ దిశగా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు. మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జనాభా తక్కువ ఉన్న దేశాల్లో జీవన ప్రమాణాలు ఎంతో మెరుగ్గా ఉంటాయని అన్నారు. జనాభా నియంత్రణ ఒక్క ప్రభుత్వ బాధ్యత కాదని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గ్రహించి ముందుకు వచ్చి జనాభా నియంత్రణకు కృషి చేయాలని కోరారు. 25 నుంచి 60 ఏళ్ల లోపు వయసు వారు 60 శాతం మనదేశంలో ఉన్నారని వీరందరికీ పని కల్పించి మానవ వనరులను సక్రమంగా వాడుకోవటానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు. ఆరోగ్య సంరక్షణ, నాణ్యమైన విద్య, ఉద్యోగాల్లో నైపుణ్యం కోసం జనాభా నియంత్రణ అత్యవసరమని దీని ప్రభావం ఆర్థికాభివృద్ధిపై స్పష్టంగా పడతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి బీ మీనాక్షి, ఉప వైద్య ఆరోగ్య అధికారిణి బీ అనురాధ, డీపీఆర్‌ఓ కె.బాల మాన్‌సింగ్ లకు జ్ఞాపికలు అందజేశారు. అనంతరం ఏడు రోడ్ల కూడలి వద్ద కుటుంబ నియంత్రణపై అందరితో ప్రతిజ్ఞ చేయించారు.

క్లుప్తంగా

ఉమ్మడి పౌరస్మృతిని వ్యతిరేకించాలని వినతి



ఎంపీ మిథున్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ముస్లిం జేఏసీ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేసే ప్రయత్నాలను వైఎస్సార్ సీపీ వ్యతిరేకించాలని ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఏలూరు విచ్చేసిన ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లిం పర్సనల్ లా అంటే దివ్య ఖురాన్, మహా ప్రవక్త మొహమ్మద్ ప్రవచనాలను అనుసరించి ముస్లింలు పాటించే ప్రత్యేక చట్టం దేశంలో ఏ ఇతర మతాలపై రుద్దబడింది కాదన్నారు. ముస్లిం పరసనల్ లాను వీడడమంటే ముస్లింలు ఇస్లాంను వీడటం వంటిదన్నారు. ఈ అంశం ముస్లిం సమాజానికి వారి విశ్వాసాలకు ముడిపడి ఉన్నందున ముస్లిం పర్సనల్‌లా కు ఉమ్మడి పౌర స్మృతిని అమలు పరచడం ముస్లిం సమాజానికి ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. ఉమ్మడి పౌరస్మృతిని వ్యతిరేకించి రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలని కోరారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి పార్లమెంట్‌లో ఉమ్మడి పౌరస్మృతి బిల్లును వ్యతిరేకించాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ముస్లిం జేఏసీ అధ్యక్షుడు ఎస్‌కే ఇబ్రహీం, అంజుమన్ ముహాఫిజుజల్ ఇస్లాం అధ్యక్షుడు ఎండీ సులేమాన్, కార్యదర్శి ఎండీ అమీర్, అహలే సున్నతుల్ జమాత్ ప్రచార కార్యదర్శి ఎండీ ఎక్బాల్, జేఏసీ కార్యదర్శి ఎండీ అన్వర్ ఉన్నారు.

మద్ది అంజన్నకు పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెంలో మద్ది ఆంజనేయస్వామిని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించారు. ప్రధానార్చకులు వేదాంతం వెంకటాచార్యులు స్వామి వారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. హుండీల ద్వారా రూ.1,32,047 ఆదాయం వచ్చిందని, 900 మంది భక్తులు స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ ఈవో ఆకుల కొండలరావు చెప్పారు. ధర్మకర్తల మండలి సభ్యులు మల్నీడి బాబి, చిలుకూరి సత్యనారాయణరెడ్డి, కర్పూరం రవి, సూపరింటెండెంట్ జవ్వాది కృష్ణ పాల్గొన్నారు.

వర్షాకాలం.. జర భద్రం

- వ్యాధులు ప్రబలేందుకు ఎక్కువ అవకాశం
- జిల్లాలో 1240 బృందాలతో జ్వరాలపై సర్వే
- పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో రక్త పరీక్షలు
- ప్రస్తుతం సాధారణ జ్వరాల కేసులే నమోదు



తణుకులో ఫీవర్ సర్వే చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

భీమవరం (ప్రకాశం చౌక్): వర్షాకాలం అంటేనే సీజనల్ వ్యాధులకు అనుకూలం. వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరి నిల్వ ఉండడంతో దోమలు, సూక్ష్మ క్రిములు, బాక్టీరియా వృద్ధి చెంది వ్యాధుల వ్యాప్తి చెందుతాయి. ఈ నేపథ్యంలో వర్షకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత తప్పనిసరిగా పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. సీజనల్ వ్యాధులకు గురైన వారిని గుర్తించి వారికి సకాలంలో వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ జిల్లా వ్యాప్తంగా ముందుగానే జ్వరాలపై సర్వే చేయిస్తోంది. ఆశ, ఏఎన్ఎం, వలంటీర్లతో కూడిన బృందాలు గ్రామాల్లో జ్వర పీడితులపై సర్వే చేస్తున్నాయి. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 1240 బృందాలు పనిచేస్తున్నాయి. ప్రస్తుతం జిల్లాలో అక్కడక్కడ మాత్రమే సాధారణ సంఖ్యలోనే జ్వరాల కేసులు నమోదువుతున్నాయి. ఈ నేపథ్యంలో వర్షాకాలంలో సోకే వ్యాధులు, వాటి లక్షణాలను వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వివరిస్తున్నారు.

సాధారణ జ్వరం

సీజన్ మార్పుతో పెరిగే సూక్ష్మక్రిముల వల్ల వైరల్ జ్వరాలు వ్యాప్తిచెందుతాయి. గాలి, నీటి ద్వారా శరీరంలోకి సూక్ష్మజీవులు ప్రవేశిస్తాయి. దీంతో జ్వరం సోకుతుంది. కొంతమందికి జ్వరంతో పాటు కీళ్ల నొప్పులు ఉంటాయి. అదే వైరల్ జ్వరం అయితే 3 నుంచి 7 రోజుల పాటు వరకు ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

- భోజనం చేసే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలి.
- నిల్వ పదార్థాలు తినరాదు, తాజా, వేడి ఆహారం తీసుకోవాలి.

చికున్ గున్యా

దోమ కాటు వల్ల చికెన్ గున్యా వ్యాధి సోకుతుంది. తీవ్రమైన జ్వరం, కీళ్ల నొప్పులు లక్షణాలు ఉంటాయి. రోజురోజుకు జ్వరం తీవ్రత పెరుగుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

- ఇళ్లు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకొవాలి.
- కూలర్లు, టైర్లు, తదితర వాటిలో నీరు నిల్వ ఉండకూడదు
- శరీరం మొత్తం కప్పేలా ఉన్న దుస్తులు ధరించాలి
- వైద్యులను సంప్రదించి మందులు వాడాలి.

మలేరియా

ఆడ అనాఫిలిస్ దోమ కాటు వల్ల మలేరియా సోకుతుంది. దోమ కాటు సమయంలో దాని లోపల ఉన్న మలేరియా జేరమ్స్ శరీరంలో లోపలికి వెళతాయి. 14 రోజులు తర్వాత తీవ్ర జ్వరం వస్తుంది. ఈ దోమలు నిల్వ ఉన్న నీటిలో వృద్ధి చెందుతాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- దోమలు కుట్టకుండా దోమ తెరలు వినియోగించాలి
- ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి
- నిల్వ ఉన్న నీటిలో కిరోసిన్ లేదా పురుగుమందు కలపాలి

డెంగీ

ఈడిస్ ఈజిప్ట అనే దోమ కాటు వల్ల డెంగీ వ్యాపిస్తుంది. అకస్మాత్తుగా జ్వరం వస్తుంది. తల నొప్పి, ఒళ్లు నొప్పులు, ఎముకలు విరిగేటంత నొప్పి కలిగిస్తుంది. ఒక్కోసారి శరీర అంతర భాగాల్లో రక్తస్రావం కలగడం జరుగుతుంది. కాళ్లు, చేతులు, ముఖం, వీపు, ఉదరం భాగాల చర్మంపై ఎర్రగా కందినట్లు చిన్నపాటి మొటిములు వస్తాయి. రక్తంలో ప్లేట్‌లెట్స్ శాతం పడిపోయి రోగి పరిస్థితి విషమంగా మారుతుంది. ఇళ్ల వద్ద ఉన్న కుండీలు, ఓవర్ హెడ్ ట్యాంకులు, తాగిపడవేసిన కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ వస్తువులు, టైర్లు వంటి వాటిల్లో చేరిన వర్షం నీటిలో ఈడిస్ దోమలు వృద్ధి చెందుతాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి
- దోమ తెరలు వాడడం శ్రేయస్కరం
- వారంలో ఒకరోజు డ్రైడే పాటించాలి
- దోమలు కుట్టకుండా శరీరం కప్పేలా దుస్తులు వేసుకోవాలి
- జ్వరం వచ్చిన వెంటనే వైద్యులకు చూపించాలి

హెపటైటిస్–ఎ

వర్షాకాలంలో హెపటైటిస్–ఎ (కామెర్లు) వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. కలుషితమైన నీరు, ఆహారం ద్వారా ఈ వ్యాధి సూక్ష్మక్రిములు శరీరంలోకి ప్రవేశిస్తాయి. ఇది కాలేయ కణాలలో సంక్రమిస్తుంది. కాలేయ వ్యాధి కారణంగా రక్తంలో బిలిరుబిన్ పరిమాణం పెరుగుతుంది. ఈ కారణంగా శరీర భాగాలు పసుపు రంగులో కనిపిస్తాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- శుభ్రమైన ఆహారం తీసుకోవాలి
- కాచిచల్లార్చిన నీటిని తాగాలి
- వ్యక్తిగత మరుగుదొడ్లు వాడాలి

టైఫాయిడ్

సాల్మొనెల్లా టైఫి బాక్టీరియా వల్ల టైఫాయిడ్ వస్తుంది. కలుషితమైన నీరు, ఆహారం తీసుకోవడం వల్ల వ్యాపిస్తుంది. కాచిచల్చారిన నీళ్లు తాగాలి. రోజుకు 3 నుంచి 4 లీటర్ల నీళ్లు తాగాలి. పండ్ల రసం, కొబ్బరి నీళ్లు, సూప్ వంటివి తీసుకోవాలి. టైఫాయిడ్‌ను నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సూచనల మేరకు వైద్యం తీసుకోవాలి..

సకాలంలో వైద్య సేవలు

జ్వరపీడితులకు సకాలంలో వైద్యం అందించడానికి జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆర్యోగ కేంద్రాలు, 18 అర్బన్ ప్రాథమిక ఆర్యోగ కేంద్రాల్లో అన్ని రకాల రక్త పరీక్షలు అంటుబాటులో ఉన్నాయి. అలాగే వైద్యులు అంటుబాటులో ఉన్నారు. గ్రామాల్లో జ్వరాల కేసులు ఎక్కువగా నమోదువుతున్నట్లు సర్వేలో తేలితే వెంటనే ఆయా గ్రామాల్లో, ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

జ్వరపీడితులకు తక్షణ పరీక్షలు

జిల్లాలో ఫీవర్ సర్వేలో జ్వరం ఉన్న వారిని గుర్తిస్తే వెంటనే వారికి వెంటనే రక్త పరీక్షలు చేసి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ద్వారా వైద్యం అందిస్తున్నారు. తాడేపల్లిగూడెం, తణుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెంగీ నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయి.

గ్రామాల్లో చురుగ్గా ఫీవర్ సర్వే



ప్రస్తుతం సీజనల్ వ్యాధులు సోకే సమయం కావడంతో జిల్లాలో ఫీవర్ సర్వే చురుగ్గా జరుగుతోంది. 1240 బృందాలు సర్వే చేస్తున్నాయి. జ్వరం కేసులు ఉంటే వెంటనే సమీపంలోని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించి వ్యాధిని నిర్ధారించి సకాలంలో చికిత్స అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. జ్వరాలు ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తాం. ప్రజలు వర్షకాలంలో స్వచ్ఛమైన నీరు, వేడి ఆహారం తీసుకోవాలి. అలాగే వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలి.

– డాక్టర్ డి.మహేశ్వరరావు, డీఎం అండ్ హెచ్‌ఓ, భీమవరం

రెండు తలల దూడ జననం



రెండు తలల దూడ



దూడకు సపర్యలు చేస్తున్న పశు వైద్యులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని ఓ రైతు ఇంట ఓ గేదె ఈనగా, రెండు తలల దూడకు జన్మనిచ్చింది. మంగళవారం పట్టణ వెటర్నరి ఆసుపత్రి ఏడీ డాక్టర్ జి.మల్లేశ్వరరావు మాట్లాడుతూ లయన్స్ నగర్‌కు చెందిన కొప్పిశెట్టి విజయ్‌కుమార్‌కు చెందిన గేదె ఈనికకు ఇబ్బంది పడుతుందని రైతు తమకు సమాచారం ఇచ్చారని తెలిపారు. పశు వైద్య సిబ్బందితో రైతు ఇంటికి చేరుకుని గేదెను పరీక్షించి డెలివరీ చేయగా రెండు తలల దూడ జన్మించింది. జన్యుపరమైన లోపం వల్ల ఇటువంటి దూడలు జన్మిస్తాయని మల్లేశ్వరరావు చెప్పారు. గేదె, దూడ ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నాయన్నారు. ఎల్ఎస్ఏ సతీష్, అంబులెన్స్ వైద్యులు డాక్టర్ ఆయుష్, సన్నీ తదితరులు గేదెకు వైద్య పరీక్షల్లో పాల్గొన్నారు.

గోదావరిలో స్వల్పంగా పెరిగిన ప్రవాహం



కుక్కునూరు వద్ద గోదావరిలో నీరు

కుక్కునూరు: తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరి నదికి వరద స్వల్పంగా పెరిగింది. నిన్నామొన్నటి వరకు గోదావరిలో ప్రవాహం లేక ఇసుక దిబ్బలు దర్శనమివ్వగా మంగళవారం ఆ ఇసుక దిబ్బలు నీటితో నిండాయి. వర్షాల వల్ల గోదావరిలో నీటి మట్టం పెరుగుతుండటంతో సాగు, తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటర్లను ముందస్తు జాగ్రత్త చర్యలతో తీసేస్తున్నారు. కాగా గత ఏడాది ఇదే నెలలో గోదావరికి భారీ ఎత్తున వరద రావడంతో విలీన మండలాల్లో దాదాపు అన్ని గ్రామాలకు వెళ్లే రహదారులు నీటమునిగి రాకపోకలు నిలిచిపోయాయి. ఈ ఏడాది వరద తీవ్రత ఎలా ఉంటుందోనన్న భయం మండలవాసుల్లో నెలకొంది.

భీమవరంలో వ్యక్తి హత్య

- భార్య అదృశ్యంపై అనుమానంతో చాకుతో దాడి.. వియ్యంకుడి మృతి
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు



భీమవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రహీమ్

సాక్షి, భీమవరం: భీమవరంలో సోమవారం అర్ధరాత్రి ఓ వ్యక్తి హత్యకు గురికాగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను కథనం ప్రకారం.. ఏలూరు గన్‌బజార్‌కు చెందిన పటాన్ శంషేర్‌ఖాన్ కుమార్తె అఫీరాను భీమవరానికి చెందిన షేక్ మహబూబ్‌జానీ కుమారుడు కరీముల్లాకిచ్చి నాలుగేళ్ల క్రితం వివాహం చేశారు. అప్పటినుంచి శంషేర్‌ఖాన్‌కు, అతని కుమార్తె అఫీరా మధ్య మాట్లల్లేవు. శంషేర్‌ఖాన్ రెండో భార్య షకీలా ఇటీవల ఇంటి నుంచి వెళ్లిపోవడంతో శంషేర్‌ఖాన్, మొదటి భార్య కుమార్తె యాసీన్, అల్లుడు ముదిబీ, కొడుకు అఫ్రోజ్‌తో కలిసి సోమవారం అర్ధరాత్రి భీమవరంలోని షేక్ మహబూబ్‌జానీ ఇంటికి వెళ్లి షకీలా గురించి ఆరా తీశారు. ఆమె తమ ఇంటికి రాలేదని చెబుతుండగానే శంషేర్‌ఖాన్ చాకుతో మహబూబ్‌జానీని పొడవగా అడ్డువచ్చిన అఫీరా, జానీ రెండో కుమారుడు రహీమ్‌లను తీవ్రంగా గాయపర్చాడు. బాధితులు ముగ్గుర్ని భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా మహబూబ్‌జానీని మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జానీ మంగళవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అడబాల శ్రీను చెప్పారు.

మిద్దేవారిపాలెంలో 12 కుటుంబాల వెలి



నడిపూడిలో ఇరువర్గాలతో మాట్లాడుతున్న డీఎస్పీ మనోహరచారి

పెనుగొండ: సామాజిక హక్కులకు భంగం కలిగిస్తూ తమను సమాజం నుంచి వెలివేశారంటూ నడిపూడి శివారు మిద్దేవారిపాలెం గ్రామస్తులు పోలీసులను ఆశ్రయించారు. ఇటీవల మిద్దేవారిపాలెంలో అంబేడ్కర్ విగ్రహానికి మెట్లు ఏర్పాటు, చేపల చెరువును తవ్వకాల తప్పులు చూపుతూ గ్రామంలోని 12 కుటుంబాలను వెలివేశారని ఆర్.గాంధీ ఆధ్వర్యంలో బాధితులు పెనుగొండ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి ఫిర్యాదు చేశారు. తమ పొలాల్లో దమ్ము చేయడానికి ట్రాక్టర్లను రానివ్వడం లేదని, పాలు కొనుగోలు చేయడం లేదని, కిరాణా షాపుల్లో నిత్యావసర వస్తువులు ఇవ్వడం లేదని ఆరోపించారు. తమకు సహకరించిన వారిని కూడా వెలివేస్తారంటూ హెచ్చరించారని వాపోయారు. గ్రామంలో ప్రశాంతంగా జీవిస్తుంటే కులాల మధ్యలో కొందరు చిచ్చు పెట్టి వెలివేశారని పోలీసులకు మొరపెట్టుకున్నారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు కె.వెంకట నారాయణ, కె.హనుమంతరావు, కె.నరేష్, కె.వెంకన్న, కె.శ్రీరామసత్యనారాయణ, కె.త్రిమూర్తులు, ఐ.సత్యనారాయణ, సీహెచ్ భాస్కరరావు, జి.నాగేశ్వరరావు, సీహెచ్ ధర్మేంద్రపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇరువర్గాలతో శాంతి కమిటీ ఏర్పాటు

బాధితుల ఫిర్యాదు మేరకు డీఎస్పీ టి రామ మనోహరచారి ఆధ్వర్యంలో మంగళవారం గ్రామంలో దర్యాప్తు ప్రారంభించారు. ఉదయం పంచాయతీ ఆవరణలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి గ్రామాల్లో కులాల మధ్య రగడ వలన అభివృద్ధి నిలిచిపోతుందని, సామరస్యంతో మెలగాలని హితవు పలికారు. ఇరువర్గాలతో శాంతి కమిటీ ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. సర్పంచ్ కే బేబీ అన్నపూర్ణ, తహసీల్దారు గురుమూర్తిరెడ్డి, వ్యవసాయాధికారి స్పందన, సీఐ జీవీవీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బస్సులో గుండెపోటుతో యువతి మృతి

గన్నవరం: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ యువతి గుండెపోటుతో మృతి చెందింది. ఈ ఘటన కృష్ణాజిల్లా గన్నవరం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఏలూరు సమీపంలోని నాయుడుపాలేనికి చెందిన షేక్ షాకీరా(22) కొంత కాలంగా హృద్రోగ సమస్యతో బాధపడుతోంది. ఇటీవల విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆమెకు స్టంట్ కూడా వేశారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రిలో చెకప్ నిమిత్తం తన పిన్నిని వెంట తీసుకుని ఏలూరు నుంచి నాన్‌స్టాప్ బస్సులో విజయవాడ బయలుదేరింది. గన్నవరం సమీపంలోకి రాగానే ఆయాసంగా ఉందని చెప్పిన షాకీరా కొద్దిసేపటికే గుండెపోటుతో కుప్పకూలి మృతి చెందింది. దీంతో డ్రైవర్ బస్సును స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిలిపివేసి ఇతర ప్రయాణికులను మరో బస్సులో విజయవాడ తరలించారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు గన్నవరం బస్టాండ్ వద్దకు చేరుకుని షాకీరా మృతదేహాన్ని స్వగ్రామం తరలించారు.

15, 16 తేదీల్లో క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్–16 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 15, 16వ తేదీల్లో చేపట్టనున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి వీవీఎస్ఎం శ్రీనివాసరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఏలూరు ఆశ్రం వైద్య కళాశాల ఆవరణలో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు. జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ ఆగస్టు 8వ తేదీ నుంచి 20 వరకు కృష్ణా జిల్లా మూలపాడులో జరిగే అంతర జిల్లాల క్రికెట్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. మరింత సమాచారం కోసం 94910 44848 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటు



ఉరదాళ్లపాలెంలో నూతనంగా ఏర్పాటైన పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

అత్తిలి: ఉరదాళ్లపాలెం గ్రామంలో అత్తిలి మండల యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పాస్టర్ వై బాబూరావు, ప్రధాన కార్యదర్శిగా కె శేఖర్‌బాబు, కోశాధికారిగా పి సంపదరావులు ఎన్నికయ్యారు. వీరిని జిల్లా నాయకులు బిషప్ ఎం ప్రేమకుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మండలంలో గల 80 మంది పాస్టర్స్ పాల్గొన్నారు.

రవీంద్రరాజుకు సన్మానం

అత్తిలి: గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికైన భూపతిరాజు రవీంద్రరాజును పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందించారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా తిరిగి ఎన్నికైన సందర్భంగా మంగళవారం పాలి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో రవీంద్రరాజుకి సన్మానం చేశారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, సర్పంచ్ కేతా గౌరీపార్వతి, ఎంపీటీసీ సభ్యురాలు నల్లమిల్లి నాగమణి, మండల జేసీఎస్ కన్వీనర్ పెన్మెత్స రామరాజు, కేతా రఘురాం, బాలాజీ రెడ్డి, హనుమంతరెడ్డి, ఎంపీడీవో రామారావు తదితరులు పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించాలి



లయన్స్ ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: యువత అన్ని రంగాల్లో ముందుండాలని లయన్స్ జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ఐఎఫ్‌బీ పాయింటు వద్ద సుశీలా ఫణికుమార్ ఆధ్వర్యంలో యూత్ ఎంపవర్ మెంటు వర్కుషాపు జరిగింది. దేశానికి యువశక్తి అవసరమని, అన్ని రంగాల్లో యువత నైపుణ్యం సాధించాలని పేరిచర్ల కోరారు. డైమండ్స్ క్లబ్ హంగర్ రిలీఫ్ ప్రోగ్రాంలో భాగంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మొక్కరాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

13న శాలివాహన చక్రవర్తి విగ్రహావిష్కరణ

తణుకు: శకపురుషుడు శాలివాహన చక్రవర్తి విగ్రహాన్ని ఈనెల 13న తణుకులో ఆవిష్కరిస్తున్నట్లు జిల్లా కుమ్మర శాలివాహన వెల్ఫేర్ కమిటీ సభ్యులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిరుదుకోట చింతన్న తెలిపారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద వైఎస్సార్ పార్కులో ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు ఆవిష్కరిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి శాలివాహన డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, రాష్ట్ర కుమ్మరి శాలివాహన సేవ అధ్యక్షుడు మానేపల్లి వీవీఎస్ఎన్ మూర్తి, జిల్లా కుమ్మరి శాలివాహన సంఘం మాజీ అధ్యక్షులు కొలుకులూరి ధర్మరాజు పాల్గొంటారని చెప్పారు.

జనాభా పెరుగుదల దేశ ప్రగతికి నిరోధకం



ఇరగవరంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

ఇరగవరం: జనాభా పెరుగుదల దేశ ప్రగతికి అవరోధమంటూ పీహెచ్‌సీ వైద్యులు క్రాంతి రెడ్డి, మౌనికలు అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం గ్రామాల్లో వైద్యులు, సిబ్బంది, ఆశావర్కర్లు అవగాహన ర్యాలీ, ప్రదర్శన చేశారు. సీహెచ్‌వో రామారాజు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఉమ్మడి పౌరస్మృతిని కేంద్రం విరమించుకోవాలి

సాక్షి, భీమవరం : ఒకే దేశం ఒకే చట్టం పేరుతో దేశంలో ఉమ్మడి పౌరస్మృతిని తెచ్చే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని దళిత జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. భీమవరం పట్టణం 11వ వార్డులోని రాజ్ ట్రస్ట్ కార్యాలయంలో మంగళవారం భీమవరం దళిత జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భగ్గుమన్న వలంటీర్లు..

- తణుకులో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



తణుకు నరేంద్ర సెంటర్‌లో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

తణుకు అర్బన్: సేవే మార్గం, సేవే లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తున్న వలంటీర్లపై జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు వారికి ఆగ్రహం తెప్పించాయి. మంగళవారం తణుకులో వలంటీర్లు నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రజల డేటాను సంఘ విద్రోహశక్తులకు ఇస్తున్నామా నువ్వు చూశావా అంటూ నిలదీశారు. అదికూడా కేంద్ర నిఘా వర్గం నిన్ను హెచ్చరించిందా అంటూ హేళన చేశారు. కోవిడ్ విజృంభించి అమాయక ప్రాణాలు గాలిలో కలిసిపోతున్న సమయంలో నువ్వు తెలంగాణలోని అద్దాల మేడలో దాక్కున్నావని, మేము రెడ్‌జోన్‌లో కోవిడ్ సోకిన వారికి సపర్యలు చేశామని గుర్తు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న గౌరవ వేతనంతో తాము గౌరవప్రదంగా విధులు నిర్వర్తిస్తున్నామని నువ్వు మాత్రం ప్యాకేజీలకు కక్కుర్తిపడి వారు మొరగమన్నట్లు మొరుగుతున్నావని విమర్శించారు. వలంటీర్లపై చేసిన అమానుష వ్యాఖ్యలను వెంటనే వెనక్కు తీసుకుని ఏపీలోని వలంటీర్లందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వలంటీర్ల నిరసన ర్యాలీ...

తణుకు నియోజకవర్గ పరిధిలోని తణుకు మునిసిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల నుంచి తరలివచ్చిన వలంటీర్లు తణుకు మునిసిపల్ కార్యాలయ ప్రాంతంలో సమావేశమయ్యారు. సమీపంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో పవన్ కల్యాణ్‌పై ఫిర్యాదు చేశారు. అక్కడ నుంచి ర్యాలీగా బయలుదేరి రాష్ట్రపతి రోడ్డు మీదుగా నరేంద్ర సెంటర్‌కు చేరుకుని ధర్నా చేశారు. అనంతరం పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను కాళ్లతో తన్ని, చెప్పుదెబ్బలు కొట్టి దహనం చేశారు.

జీతగాడు పవన్‌కల్యాణ్



వలంటీర్లు అంతా ప్రభుత్వం అందిస్తున్న గౌరవ వేతనంతో గౌరవప్రదంగా జీవిస్తున్నాం. కానీ జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మాత్రం ఒక పార్టీ నేత నుంచి జీతం తీసుకుని అతని మెప్పుకోసం పనిచేస్తున్నాడు. అందుకే ఆయనను ప్యాకేజీ స్టార్ అని పిలిచే పరిస్థితి ఏర్పడింది. – భార్గవి, వలంటీరు

క్షమాపణ చెప్పాలి



వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కల్యాణ్ తక్షణమే క్షమాపణ చెప్పాలి. దేశవ్యాప్తంగా ఎక్కడా లేని వలంటీరు వ్యవస్థ ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే ఉంది. ఈ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఏ సేవ చేరాలన్నా తక్షణమే అందే పరిస్థితి ఉంది. దీంతో యావత్ దేశం ఆంధ్రప్రదేశ్‌వైపు చూసే పరిస్థితి ఏర్పడడమే కాకుండా ఏపీ వలంటీరు వ్యవస్థపై ప్రశంసల జల్లు కురుస్తోంది. – గాయత్రి, వలంటీరు

కోవిడ్‌లో నీవు ఎక్కడ ఉన్నావు...



కోవిడ్ సమయంలో మనుషులు పిట్టల్లా రాలిపోయి స్మశానాల బాటపడుతున్నా వలంటీరు ఒక్కరే సేవే మార్గంగా పనిచేశారు. రెడ్ జోన్‌గా నిర్దేశించబడి ఉన్న ప్రాంతాల్లో సైతం సరుకులు, వారికి భోజనవసతి సమకూర్చిన చరిత్ర వలంటీర్లది. వలంటీర్లను ఒక నక్సలైటు మాదిరిగా చిత్రీకరిస్తున్నావంటే నువ్వు ఏ స్థాయికి దిగజారవో అర్థమవుతోంది. – చిన్నారి, వలంటీరు

వసతి గృహాన్ని త్వరలోనే ప్రారంభిస్తాం



ఆరుగొలను గురుకుల పాఠశాల నూతన భవనాలను పరిశీలిస్తున్న డీసీవో భారతి

తాడేపల్లిగూడెం రూరల్: ఆరుగొలను నూతన వసతి గృహాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని సాంఘిక సంక్షేమ వసతి గృహాల జిల్లా సమన్వయకర్త ఎస్.భారతి తెలిపారు. మంగళవారం మండలంలోని ఆరుగొలను డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా డీసీవో భారతి గురుకుల పాఠశాలలో ప్రవేశాలను పూర్తి చేయడం పట్ల సిబ్బందిని అభినందించారు. కొత్త భవనంలో ఈ ఏడాది తరగతులు జరిగేలా చూస్తామన్నారు. అప్పటి వరకు విద్యార్థులకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట ప్రిన్సిపల్స్ బి.శ్రీనివాస్, బి.రాజారావు, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

రాష్ట్ర పథకాలు దేశానికే ఆదర్శం

- వైఎస్సార్ సీపీ యువ నాయకుడు కారుమూరి సునీల్
- వెంకట్రాయపురంలో గడపగడపకు మన ప్రభుత్వం



తణుకు వెంకట్రాయపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న కారుమూరి సునీల్ కుమార్, తదితరులు

తణుకు టౌన్: ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శం నిలుస్తున్నాయని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు కారుమూరి సునీల్ కుమార్ తెలిపారు. మంగళవారం సాయంత్రం తణుకు పట్టణం 16వ వార్డు వెంకట్రాయపురం ప్రాంతంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల పత్రాలను పంపిణీ చేసి వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలను వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే అందిస్తున్నారని చెప్పారు. అటువంటి వలంటీర్లపై కొంతమంది విమర్శలు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న వలంటీరీ వ్యవస్థలను కేంద్ర ప్రభుత్వంతో పాటు పలు రాష్ట్రాలు కూడా ప్రశంసిస్తుంటే రాష్ట్రంలోని ప్రతిపక్షాలు మాత్రం అవమానిస్తున్నారని చెప్పారు. ఈసందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ కాపు సంఘం అధ్యక్షుడు అడ్డాల అనంత బాబు, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మంగెన సూర్య, ఉపాధ్యక్షుడు సుద్దుల పాండు, యల్లమిల్లి రమేష్ బాబు, చంద్రరావు, చింతలపూడి సూర్యనారాయణ, వర ప్రసాద్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్



ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్‌ను సత్కరిస్తున్న బీసీ సంఘ నాయకులు

తణుకు టౌన్: చేతి వృత్తి దారులు, బీసీల అభివృద్ధి, అభ్యున్నతికి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని శాసన మండలి సభ్యుడు వంకా రవీంద్రనాథ్ చెప్పారు. మంగళవారం తణుకు పట్టణంలోని ముస్లీం షాదికానాలో జరిగిన బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రంది అప్పారావు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ చేతి వృత్తుల వారికి ప్రభుత్వం బ్యాంక్‌ల ద్వారా తక్కువ వడ్డీకే అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీసీలు తమ పిల్లలను విద్యావంతులుగా చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. పేదల పిల్లలందరూ ఉన్నత విద్యావంతులు కావాలనే లక్ష్యంతో రాష్ట్రంలోని పాఠశాలలన్నింటిని నాడు–నేడు పథకంలో అభివృద్ధి చేశారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అనేక సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా బీసీ సంక్షేమ సంఘానికి వంక రవీంద్రనాథ్ కారును అందజేశారు. ఈకార్యక్రమంలో సంఘ నాయకులు పీ రామకృష్ణ, ఎన్ సీతారామరాజు, షేక్ మస్తాన్ సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా సూరంపూడి



రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘ నూతన కార్యవర్గం

తాడేపల్లిగూడెం: గూడెం రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘ అధ్యక్షునిగా సూరంపూడి వెంకటరమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు వివరాలను మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగళవారం వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో జరిగింది. ప్రధాన కార్యదర్శిగా చింతకాయల వంశీకృష్ణ, కోశాధికారిగా తగరంపూడి మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడిగా మాసా బాబూరావు, పైలు శ్రీనివాసు, ఏలూరి జగదీశ్‌లు ఎంపికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా తాడేపల్లి మోహనరావు, కూనిరెడ్డి శ్రీనివాసు, దేవికారాణి ఉడయార్ , కవురు శారద, సంయుక్త కార్యదర్శులుగా జెకె.కృష్ణ, గుడా శరత్ బాబు, మహిళా అధ్యక్షురాలుగా బోణం వెంకటలక్ష్మి, ప్రచార కార్యదర్శిగా వనచర్ల ప్రసాద్, సాంస్కృతిక కార్యదర్శులుగా కూచి వేంకట నాగేశ్వరరావు, పొన్నాడ ప్రకాష్ ఎన్నికయ్యారు.

వసతి గృహాల్లో చేరికలు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిలా అధికారి శోభారాణి

తాడేపల్లిగూడెం అర్బన్ : సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాల్లో చేరికలు పెంచాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి కె.శోభారాణి తెలిపారు. మంగళవారం గూడెంలో సాంఘిక సంక్షేమశాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వసతిగృహాల్లోని ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు, సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ అధికారులు బి రామాంజనేయులు, కార్యాలయ పర్యవేక్షులు ఎస్ సత్యనారాయణ తణుకు, నరసాపురం అధికారులు, వసతి గృహాల సంక్షేమ అధికారులు, కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు

తాడేపల్లిగూడెం: వారాహి యాత్ర సందర్భంగా పట్టణంలో బుధవారం ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సాయంత్రం మూడు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నారు. మీటింగ్‌కు వచ్చే వాహనాలకు కూడా పార్కింగ్ స్థలాలను కేటాయించారు. నల్లజర్ల నుంచి నిడదవోలు వెళ్లే వాహనాలు పెదతాడేపల్లి మేకల సంత దగ్గర నుంచి హైవే మీదుగా సాక్షి యూనిట్, కనకదుర్గమ్మగుడి, ప్రత్తిపాడు వై జంక్షన్ మీదుగా నిడదవోలు వెళ్లాలి. నిడదవోలు నుంచి నల్లజర్ల వెళ్లే వాహనాలు ప్రత్తిపాడు సాక్షి సెంటర్ నుంచి పెదతాడేపల్లి మేకల సంత దగ్గర హైవే దిగి వెళ్లాలి. నల్లజర్ల నుంచి భీమవరం వెళ్లే వాహనాలు పెదతాడేపల్లి మేకల సంత నుంచి హైవే బాదంపూడి టీ జంక్షన్, పడాల, తాడేపల్లిగూడెం పట్టణం మీదుగా భీమవరం వెళ్లాలి. భీమవరం నుంచి నల్లజర్ల వైపు వెళ్లే వాహనాలు తాడేపల్లిగూడెం పట్టణం మీదుగా బాదంపూడి వైపు కాని, ప్రత్తిపాడు సాక్షి సెంటర్ మీదుగా కాని వెళ్లి మేకల సంత దగ్గర హైవే దిగి నల్లజర్ల వైపు వెళ్లాలి. నల్లజర్ల నుంచి తాడేపల్లిగూడెం పట్టణంలోకి వచ్చే వాహనాలు పెదతాడేపల్లి మేకల సంత దగ్గర నుంచి హైవే నిట్ కాలేజ్ రోడ్డు దిగి తాడేపల్లిగూడెం పట్టణం వైపుగా వెళ్లాలి. తాడేపల్లిగూడెం పట్టణం నుంచి నల్లజర్ల వైపునకు వెళ్లే వాహనాలు తాడేపల్లిగూడెం పట్టణం లోపలి నుంచి నిట్ కాలేజ్ మీదుగా హైవే ఎక్కి పెదతాడేపల్లి మేకల సంత వద్ద హైవే దిగి నల్లజర్ల వైపు వెళ్లాలి. బాదంపూడి నుంచి నల్లజర్ల వైపు వెళ్లే వాహనాలు తాడేపల్లిగూడెం పట్టణంలోకి రాకుండా బాదంపూడి టి.జంక్షన్ నుంచి పెదతాడేపల్లి మీదుగా నల్లజర్ల వైపునకు వెళ్లాలని డీఎస్పీ తెలిపారు.

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు



తాడేపల్లిగూడెం రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వై.దుర్గాకిషోర్



తణుకుటౌన్: జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు



తాడేపల్లిగూడెం అర్బన్ జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: అర్హులందరికీ న్యాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్ అన్నారు. మంగళవారం మండలంలోని కొమ్ముగూడెం సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి దుర్గేష్ మాట్లాడుతూ వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికి తిరిగి ప్రజల అవసరాలను తెలుసుకోవాలన్నారు. ఇలా వచ్చిన అర్జీలను వారం రోజుల్లో ప్రత్యేక క్యాంపు ద్వారా పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ నెల 23వ తేది వరకు జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు వినియోగించుకోవాలన్నారు. దండగర్రలో ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. అనంతరం కొమ్ముగూడెంలో 1400, దండగర్రలో 1100 మందికి ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ఎంపీపీ సూర్పని రామకృష్ణ, సర్పంచ్‌లు తాడేపల్లి బేబి, పిల్లా రాంబాబు, ఎమ్పీటీసీ వీరమళ్ళ వెంకన్న, తహసీల్దార్ వై.దుర్గాకిషోర్, మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్, విద్యుత్ ఏఈ అల్లు రామకృష్ణ, సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ రాష్ట్ర కోశాధికారి కొల్లా విజయలక్ష్మికుమారి, ఆర్‌బీకే చైర్మన్ ములగాల గంగారావు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సురక్షతో సత్వర సేవలు

ఇరగవరం: ప్రజలందరికి సంపూర్ణ లబ్ధి చేకూర్చడానికే జగనన్న సురక్ష కార్యక్రమం అని జిల్లా డ్వామా పీడీ ఎస్‌టీవీ రాజేశ్వరరావు అన్నారు. మంగళవారం ఇరగవరం మండలం కాకిలేరు, కంతేరు గ్రామాల్లో జగనన్న సురక్ష గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డ్వామా పీడీ ఎస్‌టీవీ రాజేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు, అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎ శ్రీనివాస్ సర్పంచ్‌లు, ఉన్నమట్ల నాగమణి, గుడిమెట్ల ఆదిలక్ష్మీ, ఎంపీటీసీలు నాయకులు, గుడిమెట్ల సత్యనారాయణ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

తాడేపల్లిగూడెం అర్బన్ : స్థానిక కాపు కళ్యాణ మండపంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. లబ్ధిదారులకు దరఖాస్తుచేసుకున్న ధృవపత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి సామ్యూల్, కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, నీరుకొండ పండు, అడ్డాల నర్సింహరావు, మిద్దే అదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు

తణుకు టౌన్: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు అవసరమైన ధ్రువ పత్రాలు జగనన్న సురక్ష గ్రామ సభల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే వస్తున్నాయని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు చెప్పారు. మంగళవారం తణుకు రూరల్ మండలం వేల్పూరు 3వ సచివాలయం, దువ్వ 2వ సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష గ్రామ సభలలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా గ్రామంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది గుర్తించిన వివిధ ధ్రువ పత్రాల లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో పీ శ్రీనివాసరావు, తహసీల్దార్ పీఎస్‌డీ ప్రసాద్, మండల జేసీజీ అధ్యక్షుడు కరిబండి రాజేష్, దువ్వ గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, వేల్పూరు గ్రామ సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, గ్రామ కమిటీ అధ్యక్షుడు నున్న దుర్గాప్రసాద్, గ్రామ కార్యదర్శి వీ గంగాధరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

అత్తిలి: వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి జగనన్నసురక్ష కార్యక్రమాన్ని వివరించడంతో పాటు వారికి అవసరమైన సేవలను నమోదు చేసి, వారి సమస్యలను పరిష్కరించే మహోన్నత కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్ అన్నారు. అత్తిలి మండలం పాలి, అత్తిలి–3 గ్రామ సచివాలయాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు జరిగాయి. ఈసందర్భంగా ఏఎంసీ చైర్మన్ భరణీ ప్రసాద్ మాట్లాడుతూ సచివాలయాలు వద్ద నిర్వహించే క్యాంపుల్లో 11 సర్వీసులకు ఎటువంటి సర్వీసు ఛార్జీలు ఉండవన్నారు. ఈకార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకే తీసుకువెళ్లే వలంటీర్ వ్యవస్థపై జనసేనపార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు నీచంగా ఉన్నాయన్నారు. వలంటీర్లను సంఘ విద్రోహశక్తులుగా పోల్చడాన్ని ఖండించారు. వలంటీర్ వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. సర్పంచ్‌లు గంటావిజేత నాగరాజు, కేతా గౌరీ పార్వతి, ఎంపీటీసీ సభ్యులు నల్లమిల్లి నాగమణి, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, వైస్ ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, గారపాటి నాగరాజు, రంభ సూరిబాబు, పోలినాటి చంద్రరావు, తహసీల్దార్ ఏపీ రామాంజనేయులు, ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు పాల్గొన్నారు.

యోగాతో మంచి ఆరోగ్యం

తాడేపల్లిగూడెం: యోగాతో మంచి ఆరోగ్యం సహకరిస్తుందని ఆరా ఫౌండేషన్ యోగ మాస్టర్ కరిబండి రామకృష్ణ అన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఇక్కడ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వత్తిడిని అధిగమించి , ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎలా, వ్యక్తిత్వ వికాసం ఎలా పెంపొందించుకోవాలనే విషయాలపై అవగాహన కల్పించారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని 38 సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, నాలుగు డివిజన్లకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

గూడెం చేరుకున్న పవన్‌కళ్యాణ్

తాడేపల్లిగూడెం: వారాహి యాత్రలో భాగంగా జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ మంగళవారం రాత్రి గూడెం చేరుకున్నారు. పెంటపాడు మండలం అలంపురం శివారు జయ గార్డెన్‌లో ఆయనకు బస ఏర్పాటుచేశారు.బుధవారం సాయంత్రం ఐదు గంటలకు పట్టణంలోని హౌసింగ్‌బోర్డు సెంటర్ వద్ద ఎస్‌వీఆర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభ ప్రాంతానికి అలంపురం జయగార్డెన్స్ నుంచి మోటారు సైకిల్ ర్యాలీతో పవన్ చేరుకుంటారు.

అంబేడ్కర్‌కు అవమానంపై ఆగ్రహం



తణుకులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న దళిత వర్గాలు

తణుకు అర్బన్: డా.బిఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని కాళ్లతో తన్నిన జన సైనికులు, పవన్ కల్యాణ్ ఏలూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద క్షమాపన చేప్పక పోతే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని దేశ వ్యాప్తంగా తణుకులో దళిత వర్గాలు తీవ్రంగా ఖండించాయి. ఈ సందర్భంగా మంగళవారం తణుకులో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్, మైనారిటీ నాయకులు తణుకు మున్సిపల్ కార్యాలయం వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బేషరతుగా పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలని, ఇటువంటి సంఘటనలు జరకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం అనంద కుమార్, పొట్ల సురేష్, పట్టణ ఉపాధ్యక్షుడు సుద్దుల పాండు, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెనుమాల రాజేష్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కత్తుల జెస్‌పాల్, మైనారిటి సెల్ అధ్యక్షుడు షేక్ బాషా, పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించిన వారిని తక్షణమే అరెస్టు చేయాలి

అత్తిలి: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఏలూరులో నిర్వహించిన వారాహి యాత్రలో జనసేన కార్యకర్తలు భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం పైకి కాళ్లతో ఎక్కి అపవిత్రం చేసిన తీరుకు నిరసనగా అత్తిలి బస్‌స్టేషన్ సెంటర్‌లోగల అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఎస్సీసెల్ నాయకులు కొమ్మర రామారావు, నూకపెయ్యి రామకృష్ణ, సబ్బితి రాజేష్, బుడితి సుజన్‌కుమార్, యాళ్ల సాధు సుందర్‌సింగ్, బుంగా పద్మారావు, ఇల్లూరి సంపదరావు, పి సంపదరావు, బొడ్డు ఆమోసు, పూడిమూడి ప్రసాద్, రాయుడు ధర్మారావు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తణుకు అర్బన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంటే దోమ పుట్టుకను నివారించి, వ్యాధులను పూర్తిగా అరికట్టవచ్చని అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ పి.శ్రీనివాసరావు అన్నారు. తణుకు ఫైలేరియా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి సబ్ యూనిట్ ఆఫీసర్స్ రివ్యూ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాల్సిన బాధ్యతను తీసుకోవాలని సూచించారు. తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం, నరసాపురం సబ్ యూనిట్ ఆఫీసర్లు జి.వెంకటేశ్వరరావు, వైవీ లక్ష్మణరావు, కె.భాస్కరరావు, ఎస్.తాతాజీ పాల్గొన్నారు.

టీడీఆర్ బాండ్ల స్థలాలు స్వాధీనం చేసుకున్నాం

తాడేపల్లిగూడెం: టీడీఆర్ బాండ్లకు సంబంధించిన స్థలాలను పురపాలక సంఘం ఆధీనంలోకి తీసుకుందని మునిసిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్ మంగళవారం రాత్రి తెలిపారు. ఆ స్థలాలు యజమానులు గిఫ్ట్ డీడ్ ద్వారా పురపాలక సంఘానికి రాసిచ్చారన్నారు. భీమవరం రోడ్డులో పోలీసు ఐలాండ్ నుంచి మాస్టర్ ప్లాన్ ప్రకారం అన్ని అనుమతులు తీసుకొని తొమ్మిది టీడీఆర్ బాండ్లు జారీ చేశామన్నారు. వీటిలో ఎటువంటి అభ్యంతరాలు లేవన్నారు. ఈ తొమ్మిదింటిలో ప్రస్తుతం ఎనిమిది ఖాళీ స్థలాలుగానే ఉన్నాయన్నారు. ఒక సినిమా హాల్‌కు సంబంధించి ప్రహరీగోడ ఉండటంతో వారికి నోటీసులు ఇచ్చామని , 15 రోజుల్లో ప్రహరీగోడ కూడా తీసివేసి స్థలాన్ని పురపాలక సంఘానికి అప్పగించడానికి సిద్ధంగా ఉన్నారని కమిషనర్ తెలిపారు. ఈ ప్రహరీ గోడకు సంబంధించి మార్కింగ్ కూడా ఇచ్చామన్నారు. టీడీఆర్ బాండ్ల వ్యవహారంలో ఎటువంటి గోల్‌మాల్ జరగలేదని, అంతా నిబంధనల ప్రకారమే జరిగిందన్నారు.